నమస్తే తెలంగాణ
నిజామాబాద్, గురువారం 29 ఆగస్టు 2024
THURSDAY, AUGUST 29, 2024

1న సంగీత్ కల్చరల్ అకాడమీ వార్షికోత్సవం

సుభాష్‌నగర్, ఆగస్టు 28 : సంగీత్ కల్చరల్ అకాడమీ వార్షికోత్సవాన్ని సెప్టెంబర్1న జిల్లాకేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు ఆష్ట గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 11 మందికి పురస్కారాలు, నలుగురికి ప్రత్యేక అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, సాహితీ, భాషాభిమానులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

బయోటెక్నాలజీ విభాగాధిపతిగా ప్రసన్నశీల

డిచ్‌పల్లి, ఆగస్టు 28 : టీయూ బయోటెక్నాలజీ విభాగాధిపతిగా డాక్టర్ ఎం.ప్రసన్నశీల నియామకమయ్యారు. టీయూ వీసీ సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి ఆమెకు బుధవారం నియామకపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం ప్రసన్నశీల జువాలజీ విభాగానికి విభాగాధిపతిగా వ్యవహరిస్తున్నారు. గతంలో అడిషనల్ కంట్రోలర్‌గా, ఉమెన్ సెల్ డైరెక్టర్‌గా, పబ్లికేషన్స్ సెల్ డైరెక్టర్‌గా తదితర పదవులను సమర్థవంతగా నిర్వర్తించారు. ఆమెకు ప్రొఫెసర్లు శుభాకాంక్షలు తెలిపారు.

'గ్రామస్థాయిలో పాలన అస్తవ్యస్తం'

రుద్రూర్, ఆగస్టు 28 : ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో గ్రామస్థాయిలో పాలన అస్తవ్యస్తంగా మారిందని రివల్యూషన్ సోషలిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి యార్లగడ్డ సాయిబాబా ఆరోపించారు. మండలకేంద్రంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడం ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారని, కార్యదర్శులు సైతం పనిచేయడం లేదని విమర్శించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలి మృతి

వినాయక్‌నగర్, ఆగస్టు 28 : నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన చల్ల భూలక్ష్మి (70) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. సీతారామ్‌నగర్ కాలనీకి దంపతులు దవాఖానలో చూపించుకొని, తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. భూలక్ష్మికి గాయాలు కాగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డ్రైవ్

మోపాల్ (ఖలీల్‌వాడి),ఆగస్టు 28 : మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ – నిజామాబాద్ ఆధ్వర్యంలో ప్రీయూనిక్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ వారు మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌ను బుధవారం చేపట్టారు. రైతు ఆదే ప్రవీణ్‌కుమార్‌కు చెందిన నాలుగున్నర ఎకరాల భూమిలో మొక్కలు నాటి ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రీయూనిక్ ఇన్‌చార్జి గణేశ్, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు, ఎస్సీ హాస్టల్ పరిశీలన

సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

ఇందల్వాయి, ఆగస్టు 28 : ఇందల్వాయి గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య పనులు, ఎస్సీ హాస్టల్‌ను డీపీవో తరుణ్.. ఎంపీడీవో అనంత్‌రావుతో కలిసి బుధవారం పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని, డెంగీ, మలేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట ఎంపీవో రాజ్‌కాంత్‌రావు, ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి, ఆశవర్కర్లు ఉన్నారు.

విద్యార్థినులకు అభినందన

మాక్లూర్, ఆగస్టు28: మండలంలోని దాస్‌నగర్‌లోని రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన విద్యార్థి కౌన్సిల్ ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థి కౌన్సిల్ మెంబర్లను బుధవారం అధ్యాపకులు అభినందించారు. కెప్టెన్‌గా హర్షిణి, ప్రధాన కార్యదర్శిగా నిర్మల, క్రీడాకార్యదర్శిగా మెహర్జు, కల్చరల్ కార్యదర్శిగా ప్రతిక్ష, మెస్ కార్యదర్శిగా తేజస్విని, నిర్వాహక కార్యదర్శిగా శ్రేయ, లైబ్రేరియన్‌గా ప్రవళిక తదితరులు ఎన్నికల్లో గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ దాత్రిక వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

కంఠేశ్వర్, ఆగస్టు 28 : ఆంక్షలు లేకుండా అర్హులందరికీ రుణమాఫీ చేయాలని టీడీపీ జిల్లా పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్ డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కవిత పోస్టర్‌ను చూపుతున్న ధర్పల్లి మాజీ ఎంపీపీ నల్ల సారిక

కవితకు స్వాగతం పలికేందుకు వెళ్లిన ఇందల్వాయి, డిచ్‌పల్లి, ధర్పల్లి నాయకులు

ధర్పల్లి, జక్రాన్‌పల్లి నాయకులు..

రుద్రూర్/ ధర్పల్లి/ ఇందల్వాయి/ జక్రాన్‌పల్లి, ఆగస్టు 28 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం, ఆమె బుధవారం ఢిల్లీ నుంచి శంషాబాద్‌కు చేరుకోవడంతో స్వాగతం పలికేందుకు జిల్లాలోని వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఆమెకు స్వాగతం పలుకడంతోపాటు కవిత ఫొటోలతో ఉన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీలో బుధవారం ఉదయం కవితను బోధన్ బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎంఏ.రజాక్, బోధన్ ఏఎంసీ మాజీ డైరెక్టర్ తారాచంద్ కలిశారు. దర్గాలో ప్రార్థనలు చేయించి దట్టీని ఆమెకు అందజేశారు. రుద్రూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు పటాకులుకాల్చి, స్వీట్లు పంచుకొని సంతోషం వ్యక్తం చేశారు.

కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్‌లో పటాకులు కాల్చుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఢిల్లీలో ఎమ్మెల్సీ కవితతో మైనార్టీ సెల్ రాష్ట్రనాయకుడు ఎంఏ.రజాక్

కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలి

- అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్‌కుమార్

మోర్తాడ్, ఆగస్టు 28: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజన ఏజెన్సీలు కిచెన్‌గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్‌కుమార్ సూచించారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనం విషయంలో పూర్తిస్థాయి పరిశుభ్రత పాటించాలని సూచించారు. తరగతి గదులు, డిజిటల్ క్లాస్‌లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఎంఈవో ఆంధ్రయ్య, హెచ్‌ఎం సాయన్న ఉన్నారు. అనంతరం హసాకొత్తూర్ గ్రామంలో ఉన్న పాలీహౌస్ ఆర్కిడ్ పూలతోటను పరిశీలించారు. సస్య రక్షణ విధానం, మార్కెటింగ్ వివరాలను రైతు మోహన్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని రైతులను కలిసి వారి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి రాజు, ప్రవీణ్, మనోహర్, రమేశ్, కిషన్, మురళి, రాము పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

స్పోర్ట్స్ డే ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

మాక్లూర్, ఆగస్టు28: క్రీడా దినోత్సవం సందర్భంగా మానిక్‌బండార్ ఉన్నత పాఠశాలలో వారం రోజులుగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం సత్యనారాయణ బుధవారం తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం బహుమతులు అందజేస్తా మని అన్నారు. వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు స్పోర్ట్స్‌డే ఆకారంలో కూర్చుని అలరించారు.

పేద యువకుడి కంటి శస్త్రచికిత్స

కోటగిరి/ పోతంగల్, ఆగస్టు 28 : కోటగిరి లయన్స్ క్లబ్ డైమండ్ ప్రతినిధులు ఓ పేద యువకుడి కంటికి ఉచితంగా బుధవారం కంటి శస్త్రచికిత్స చేయించారు. పోతంగల్ మండలం జల్లాపల్లిఫారానికి చెందిన రాంచందర్‌కు ఒకే కన్ను పనిచేయడం, ఆ కన్నుకు కూడా కాటరాక్ట్ ఆపరేషన్ తప్పనిసరి అయ్యింది. తండ్రి లేకపోవడం, పేద కుటుంబానికి చెందిన వాడు కావడంతో అదే గ్రామానికి చెందిన దస్తగిరి.. ఈ విషయాన్ని లయన్స్ క్లబ్ డైమండ్ సభ్యులకు వివరించారు. దీంతో లయన్స్ క్లబ్ డైమండ్ ప్రతినిధులు రూ. 25 వేల లెన్స్ వేయించి, కాటరాక్ట్ కంటి ఆపరేషన్ చేయించారు. ఇందుకు సహకరించిన లయన్స్ కంటి దవాఖాన ట్రస్ట్ నిర్వాహకులు బసవేశ్వరావుకు క్లబ్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు తెల్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శి హన్మంతరావు పటేల్, కోశాధికారి కప్ప సంతోష్, సభ్యులు యోగేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాంచందర్‌తో లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ కోటగిరి సభ్యులు

మాస్కుల పంపిణీ

మాస్కులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మకరంద్

కంఠేశ్వర్, ఆగస్టు 28 : జిల్లాకేంద్రంలోని గోల్ హనుమాన్ సర్కిల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందికి లయన్స్‌క్లబ్ –నిజామాబాద్ ప్రతినిధులు బుధవారం మాస్కులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ మకరంద్ హాజరై సిబ్బందికి మాస్కులను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ నిజామాబాద్ చైర్మన్ చాకు లింగం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీల అమలుకు పోరాడుదాం

బోధన్/ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 28: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకోసం విద్యుత్తు అమరుల స్ఫూర్తితో పోరాడాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా బోధన్ డివిజన్ నాయకుడు మల్లేశ్ కోరారు. 2000లో విద్యుత్తు ఉద్యమంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి సంతాప సభ బుధవారం పట్టణంలోని తట్టికోట్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్తు అమరవీరులకు నివాళులు అర్పిస్తూ మౌనం పాటించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు పడాల శంకర్, బి.సాయిలు, బి.పోశెట్టి, పీవోడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అమరులకు నివాళి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి చంద్రబాబు ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా నిర్వహించిన ఆందోళనలో అమరులైన వారికి పట్టణంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పంథా పార్టీ నాయకుడు బి.దేవారాం, పార్టీ నాయకులు నివాళులర్పించారు. దేవారాం మాట్లాడుతూ నాటి చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు తెచ్చి ప్రజలకు తీవ్రమైన నష్టం కలిగించేలా చేసిందన్నారు. హైదరాబాద్‌లో ఆందోళన కారులపై పోలీసులు కాల్పులు జరిపారని అన్నారు. ఈ కాల్పుల్లో వేలాది మంది గాయపడ్డారని, రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామి మృతి చెందారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, సీపీఎంఎల్ నాయకులు కిషన్, మచ్చర్ల రాజన్న, తలారి గంగాధర్, అమీనాపూర్ రమేశ్, లక్ష్మక్క, పద్మక్క తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

ఆర్మూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

పింఛన్లు పెంచి హామీని నెరవేర్చాలి

దూపల్లిలో మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ

రెంజల్, ఆగస్టు 28: దివ్యాంగులకు ఇచ్చిన హామీని అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు అధికారంలోకి రాగానే విస్మరించారని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్య వంశీ అన్నారు. బుధవారం రెంజల్ మండలం దూపల్లి గ్రామంలో, నవీపేట మండల కేంద్రంలో వికలాంగుల హక్కుల పోరాట సమితీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అత్మ గౌరవ జెండాను ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో పింఛన్ రూ.4వేల నుంచి రూ. 6వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దూపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భూమయ్య, జిల్లా నాయకుడు గంగాధర్, మండల నాయకులు అబ్బయ్య, సాయిలు, పోశెట్టి, స్వరూప తదితరులు పాల్గొన్నారు. నవీపేటలో వీఎచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు సతీశ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు మానికోళ్ల గంగాధర్, ఉపాధ్యక్షుడు విజయ్ రాము, కార్యదర్శి శంశద్దీన్ దివ్యాంగులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

ముప్కాల్, ఆగస్టు 28: బాధిత కుటుంబానికి గ్రామస్తులు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన కంచు రాము కరోనా సమయంలో మృతి చెందాడు. ఆయన భార్య గుండెపోటుతో ఇటీవల మృతి చెందింది. వారి ఇద్దరు కూతుర్లు ఆకృతి, లాయకృతి అనాథలయ్యారు. రాము చిన్ననాటి తోటి స్నేహితులు, 1992 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు బుధవారం అనాథలకు రూ.85వేలను అందజేశారు. కార్యక్రమంలో రమేశ్, ఎం.దయానంద్, ఏ.ఆనంద్ గౌడ్, లోక ముత్యం, మార మనోహర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

బోధన్ రూరల్ మండలంలోని పెంటకలాన్‌లో బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి రేఖ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శిరీష, ఉపాధ్యాయులు వసంత్, ఏఎన్ఎం హేమలతను మాజీ సర్పంచ్ తల్వేద రమణ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు. –బోధన్ రూరల్, ఆగస్టు 28

మస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మాట్లాడుతున్న ఏడీఏ మల్లయ్య

మోర్తాడ్, ఆగస్టు 28: ఏవోలు, ఏఈవోలు రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏడీఏ మల్లయ్య సూచించారు. మోర్తాడ్ రైతువేదికలో బుధవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి ప్రాధాన్యత పెరుగుతుండడంతో రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఏడీఏ మల్లయ్యను, భీమ్‌గల్ ఏడీఏగా వచ్చిన శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఏవోలు హరీశ్, రమ్యశ్రీ, ఏఈవోలు రంజిత్, శ్రీలత, మహేశ్, లక్‌పతి పాల్గొన్నారు.

కొత్తిమీర @ రూ. 400

కోటగిరి, ఆగస్టు 28 : ఎన్ని కూరగాయలు కొనుగోలు చేసినా.. చివరికి కొత్తిమీర కొనాల్సిందే. కూర ఏదైనా కొంత కొత్తిమీర పడాల్సిందే. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన వారంతపు సంతలో కొత్తిమీర ధరను చూసి కొనుగోలుదారులు అవాక్కయ్యారు. వారం క్రితం కిలో రూ.200–రూ.300 ఉండగా ప్రస్తుతం కిలో కొత్తిమీర ధర రూ. 400కు చేరింది. రాష్ట్రంలో, జిల్లాలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా కొత్తిమీర పంట చీడపీడల బారి నపడుతుండడంతో పంట దిగుబడి తగ్గింది, వ్యాపారులు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటుండడంతో రవాణా, ఇతర ఖర్చుల కారణంగా ధర పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

శుభకార్యంలో విషాదం

నందిపేట్, ఆగస్టు 28: బాల్కొండ మండలంలో మంగళవారం రాత్రి నందిపేట్ మండలం మాయాపూర్‌కు చెందిన అఖిలాష్ అనే యువకుడు కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. తన బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి మంగళవారం రాత్రి అఖిలాష్ హాజరయ్యాడు. హల్దీ వేడుక జరుగుతున్న సమయంలో ఫోన్ కాల్ రావడడంతో డాబాపైకి ఎక్కాడు. ఫంక్షన్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లకు చేయి తాకడంతో గాయాలపాలై మృతి చెందాడు. మృతుడు జిల్లా కేంద్రంలో డిగ్రీ చదువుతున్నాడు. 15 ఏండ్ల క్రితం అతని తండ్రి పొలంలో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు.

అప్పులబాధతో మహిళ ఆత్మహత్య

మోర్తాడ్, ఆగస్టు 28: ధర్మోరాకు చెందిన కానూరు లక్ష్మి(42) అప్పుల బాధతో మొండివాగులో పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై విక్రమ్ కథనంన.. ఈనెల 24న ఇంటి నుంచి బయటికి వెళ్లిన లక్ష్మి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం ధర్మోరా శివారులోని మొండివాగు బ్రిడ్జి వద్ద శవమై తేలింది. లక్ష్మి, ఆమె భర్త గణేశ్ తరచూ అప్పుల విషయంలో గొడవలు పడేవారు. గణేశ్ ఇటీవల దుబాయ్ వెళ్లాడు. మృతురాలి కూతురు సంజుశ్రీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోటర్ సైకిల్ చోరీ

నవీపేట, ఆగస్టు28: యంచ గ్రామంలో ద్విచక్ర వాహనం చోరీకి గురైందని ఎస్సై వినయ్‌కుమార్ బుధవారం తెలిపారు. రోడ్డోల్ల నాగమణి నెల 23న రాత్రి తన ఇంటి ఎదుట తన ద్విచక్రవాహనాన్ని నిలిపి ఉంచగా దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

- **రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తు స్వీకరణ** - కోటగిరి/చందూర్/రుద్రూర్, ఆగస్టు 28 : పంట రుణం మాఫీ కాని రైతుల నుంచి ఏఈవోలు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి, నోడల్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. కోటగిరి మండలంలో ఇప్పటివరకు 215 మంది రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. చందూర్ మండల కేంద్రంలోని సొసైటీలో రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకునే విధానంపై వ్యవసాయ నోడల్ అధికారి రవీందర్, మండల వ్యవసాయాధికారిణి సౌజన్య అవగాహన కల్పించారు. అనంతరం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రుద్రూర్ మండలంలో రుణమాఫీ కాని కుటుంబ సభ్యుల ధ్రువీకరణ కార్యక్రమం గురువారం నుంచి చేపట్టనున్నట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.
- **రుణమాఫీపై ఇంటింటి సర్వే**- బాల్కొండ/ఏర్గట్ల, ఆగస్టు 28: రుణమాఫీ వర్తించని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు బాల్కొండ ఏవో లావణ్య తెలిపారు. వచ్చే నెల 9వ తేదీ వరకు సర్వే చేసి సంబంధిత యాప్‌లో వివరాలు నమోదు చేస్తామన్నారు. ఏర్గట్ల మండలంలో గురువారం నుంచి సర్వే నిర్వహించనున్నట్లు ఏఈవోలు సాయిసచిన్, జి.మానస తెలిపారు. రైతులు తేదీల్లో పంచాయతీల వద్ద ఉదయం 10గంటలకు హాజరుకావాలని సూచించారు.
- **కొనసాగుతున్న సప్తాహం** - కోటగిరి, ఆగస్టు 28 : మండలకేంద్రంలో శ్రీఅభయ బసవేశ్వర శివాయల ఆవరణలో అఖండ శివనామ సప్తాహం కొనసాగుతున్నది. ఐదో రోజు బుధవారం ప్రత్యేక పూజలు, పరమ రహస్య గ్రంథపారాయణం, అన్నదానం తదితర కార్యక్రమాలు చేపట్టారు.
- **వధువుకు తెల్ల యువసేన చేయూత** - కోటగిరి, ఆగస్టు 28 : మండలకేంద్రానికి కుమ్మరి గంగమ్మ కుమార్తె వివాహానికి తెల్ల రవి యువసేన నిర్వాహకులు రవికుమార్ బుధవారం చేయూతనందించారు. వధువుకు పెళ్లి చీరలు, టేబుల్ ఫ్యాన్ అందజేశారు.
- **ఇంటింటా ఓటరు నమోదు సర్వే** - కోటగిరి, ఆగస్టు 28 : మండలంలోని ఎత్తొండతోపాటు వివిధ గ్రామాల్లో బీఎల్‌వోలు ఇంటింటా తిరిగి ఓటు హక్కు నమోదుతోపాటు ఓటరు కార్డులో సవరణలు చేసెందుకు సర్వే చేపట్టారు. ప్రతిరోజూ 20 ఇండ్లు సర్వే చేపట్టనున్నట్లు బీఎల్‌వోలు తెలిపారు.
- **విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినం** - ఖలీల్‌వాడి, ఆగస్టు 28 : విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినాన్ని జిల్లాకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి విద్యుత్ పోరాట అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2000, ఆగస్టు 28న విద్యుత్ చార్జీల పెంపునకు నిరసన చేపట్టగా.. పోలీసుల లాఠీచార్జిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని, వందలాది మంది గాయాలపాలయ్యారని తెలిపారు. నాయకులు సుజాత, విఘ్నేశ్, సిర్ప లింగం, నర్సయ్య, అనసూయమ్మ, అనిత, ఉద్ధవ్, సతీశ్, రాజు పాల్గొన్నారు.
- **ఉపాధి హామీ పనుల పరిశీలన** - ధర్పల్లి, ఆగస్టు 28 : మండలంలోని హొన్నాజీపేట్, వాడి గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో బాలకృష్ణ బుధవారం పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో ఓటరు జాబితాను పరిశీలించి, ఆయా గ్రామాల్లో మొక్కలు నాటారు.
- **ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు..** - రుద్రూర్, ఆగస్టు 28 : మండలకేంద్రంలో రెవెన్యూ శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ శ్రుతి, ఆర్ఐ నజీర్, పంచాయతీ సిబ్బంది చందర్ తదితరులు పాల్గొన్నారు.
- **సీజ్ చేసిన ఇసుకకు వేలం** - పోతంగల్, ఆగస్టు 28 : సుంకిని వెళ్లే దారిలో 13 ట్రాక్టర్ల ట్రిప్పుల ఇసుకను మంగళవారం రాత్రి అధికారులు సీజ్ చేశారు. ఇసుకకు తహసీల్ కార్యాలయంలో బుధవారం వేలం నిర్వహించగా.. సుంకిని గ్రామానికి చెందిన యాదారావు రూ.8,400 కు దక్కించుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు.
- **పంచముఖి హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన** - డిచ్‌పల్లి, ఆగస్టు 28 : డిచ్‌పల్లి మండలంలోని సాంపల్లిలో పంచముఖి హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని పండితుడు పవన్ శర్మ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, యజ్ఞం, పూర్ణాహుతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ మోహన్‌రెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.
- **1న బాంసెఫ్ రాష్ట్ర మహాసభలు** - ఖలీల్‌వాడి, ఆగస్టు 28 : సంగారెడ్డి జిల్లాలోని అంబేద్కర్ భవన్‌లో బాంసెఫ్ 11వ రాష్ట్ర మహాసభలను సెప్టెంబర్ 1న నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు బట్టి చెన్నయ్య తెలిపారు. నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఓబీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు రాజమల్లు, సిద్ధిరాములు, రమేశ్, నాగరాజు, మధు, శ్రావణ్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.
- **పీఆర్టీయూ టీఎస్ మండల కమిటీ ఎన్నిక** - రుద్రూర్/బాల్కొండ, ఆగస్టు 28 : పీఆర్టీయూ టీఎస్ మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వై.విఠల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ. దస్తగిర్, అసోసియేట్ అధ్యక్షుడిగా వి.వీరేశం, మహిళా ఉపాధ్యక్షురాలిగా జి.శిరీష ఎన్నికయ్యారు. నూతన కమిటీని జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శానం సాయిలు సన్మానించారు. పీఆర్‌టీయూ బాల్కొండ మండల అధ్యక్షుడిగా వేల్పూర్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గడ్డం ప్రతాప్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా పిల్లి గోపి, కార్యదర్శిగా రాజేశ్వర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా విద్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు హాజరయ్యారు.
- **జీజీహెచ్ ప్రాంగణంలో గుర్తుతెలియని మృతదేహం** -వినాయక్‌నగర్, ఆగస్టు 28 : జిల్లాకేంద్రంలోని జిల్లా ప్రభుత్వ దవాఖాన ప్రాంగణంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి సుమారు 45 ఏండ్లు ఉంటాయని, వివరాలు తెలియరాలేదని ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించామని, సంబంధీకులు 8712659837, 8712659714, 08462–22015008462–220150 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.
- **ఆహ్వాన పత్రం అందజేత**- ఆర్మూర్‌టౌన్, ఆగస్టు28: పట్టణంలోని శ్రీరామ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యుడు, కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డికి బుధవారం వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలకు పాల్గొనాలని కోరుతూ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.
- **పోస్టర్ల ఆవిష్కరణ**- ఆర్మూర్‌టౌన్, ఆగస్టు28: పీవోడబ్ల్యూ రాష్ట్ర ఏడో మహాసభల పోస్టర్లను పట్టణంలోని పీవోడబ్ల్యూ కార్యాలయంలో ఆర్మూర్ డివిజన్ నాయకురాలు మహ్మది ఫరానా బుధవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 31న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ర్యాలీ, సభను విజయవంతం చేయాలని కోరారు.
- **పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి**- ముప్కాల్, ఆగస్టు28: మండల కేంద్రంలోని కాలనీల్లో అధికారులు పర్యటించారు. ఇండ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఎంపీవో మహ్మద్ గౌస్, ఏపీవో పద్మ, ఆశ వర్కర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.
- **లబ్ధిదారులకు శిక్షణ**- ఆర్మూర్‌టౌన్, ఆగస్టు28: మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం పాడి పశువులు, ఫౌల్ట్రీ యూనిట్ లబ్ధిదారులకు అధికారులు శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా వెటర్నరి డాక్టర్ ప్రభాకర్ హాజరై మాట్లాడారు.
- **పారిశుద్ధ్య పనుల పరిశీలన** - ఆర్మూర్‌టౌన్, ఆగస్టు28: పట్టణంలోని 20వ వార్డులో పారిశుద్ధ్య పనులను బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా పరిశీలించారు. 20వ వార్డు ప్రజలు సమస్యలు తన దృష్టికి తీసుకురావడంతో డ్రైనేజీలు శుభ్రం చేయించి, పిచ్చి మొక్కలు తొలగించారు. డ్రైనేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించినట్లు ఆయన తెలిపారు.
- **కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు**- బాల్కొండ, ఆగస్టు 28: మండల కేంద్రంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య సిబ్బంది బుధవారం డ్రైనేజీల్లోని చెత్తను తొలగించినట్లు జీపీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.
- **సైబర్ నేరాలు, ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన**- ఎడపల్లి, ఆగస్టు28: మండల కేంద్రంలోని సాటాపూర్ గేట్ వద్ద యువకులకు పోలీసులు బుధవారం సైబర్‌నేరాలు, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని అన్నారు. కారు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు.
- **రైతులకు రుణాలు అందజేత**- ఏర్గట్ల, ఆగస్టు 28: రైతులకు సేవలందించేందుకు ముందుంటామని తాళ్ల రాంపూర్ సొసైటీ చైర్మన్ పెద్దకాపు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని తాళ్ల రాంపూర్ సొసైటీలో రుణమాఫీ అయిన 52మంది రైతులకు నూతనంగా రూ.49 లక్షల 75 వేల రుణాలు బుధవారం అందజేశారు.
- **దరఖాస్తు చేసుకోవాలి..** -భీమ్‌గల్, ఆగస్టు 28: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలు పొందే అభ్యర్థులకు ఈనెల 31 వరకు అవకాశమున్నదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సతీశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

यूनियन बैंक ऑफ इंडिया
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ

ఆర్యానగర్ శాఖ
డోర్ నెం. 1-13-405/సి, రుక్మిణి హౌస్,
వినాయక్‌నగర్, నిజామాబాద్-503 001.

తేది: 15-07-2024

SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

దిగువ వారికి:
1) శ్రీ గడ్డం సురేందర్ రెడ్డి, తండ్రి: గడ్డం గంగారెడ్డి, ఫ్లాట్ నెం. 401, ఇం.నెం. 11-1-279/4/40, పృథ్వీ వసంత్ ప్రెస్టేజ్ పార్క్, వార్డ్ నెం. 11, బ్లాక్ నెం. 1, కంఠేశ్వర్, నిజామాబాద్-503 003, **హామీదారు: 2) శ్రీ మామిడి ప్రవీణ్ రెడ్డి, తండ్రి: ఎం.లింబారెడ్డి**, ఫ్లాట్ నెం. 208, మొదటి అంతస్తు, అలేఖ్య అవెన్యూ, గంగాస్థాన్ ఫేజ్ II, గోపన్‌పల్లి గ్రామం, నిజామాబాద్ మండలం మరియు జిల్లా-503 003.

సర్/మేడమ్,
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(3)తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద నోటీసు.

ఇందులో చిరునామాదారు నెం. 1 అయిన మీరు మా **ఆర్యానగర్ శాఖ** నుండి దిగువ తెలిపిన రుణ సదుపాయాలు వినియోగించుకున్నారు మరియు బకాయి/వాయిదా/వడ్డీ చెల్లింపులో విఫలమైనందున మరియు ఖాతాల నిర్వహణ సంతృప్తికరంగా లేనందున ఇన్‌కమ్ రికగ్నిషన్ మరియు ప్రూడెన్షియల్ అకౌంటింగ్ నియమాలకు అనుగుణంగా RBI మార్గదర్శకాల ప్రకారం మీ ఖాతా **13-07-2024** నాటికి నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడింది. మీ ఖాతాలలో బకాయి 15-07-2024 నాటికి **రూ. 30,04,304.71/- (ముప్పై లక్షల నాలుగు వేల మూడు వందల నాలుగు రూపాయల డెబ్బై ఒక్క పైసలు మాత్రమే).**
పైన తెలిపిన ఖాతాలో నెం.1 అయిన మీ నుండి బ్యాంక్‌కు గల బకాయి మొత్తం వివరాలు దిగువ ఇవ్వబడినవి:

ఖాతా నెం. & వసతి	NPA తేదీ నాటికి అనగా 13-07-2024 నాటికి బకాయి మొత్తం (రూ. లలో)	వర్తించని వడ్డీ 13-07-2024 నుండి 15-07-2024 వరకు (రూ. లలో)	అపరాధ వడ్డీ (సింపుల్) (రూ. లలో)	బ్యాంక్ ద్వారా భరించబడిన వ్యయం/ ఛార్జీలు (రూ. లలో)	NPA తేదీ అనగా 13-07-2024 నుండి అందిన క్రెడిట్స్	తేదీ నాటికి మొత్తం బకాయిలు (రూ. లలో)
179330100023220 హౌసింగ్ లోన్	30,02,667.71	1,496.00	141.00	0.00	0.00	30,04,304.71

మొత్తం బకాయిలు: రూ. 30,04,304.71/- (ముప్పై లక్షల నాలుగు వేల మూడు వందల నాలుగు రూపాయల డెబ్బై ఒక్క పైసలు మాత్రమే).

శ్రీ గడ్డం సురేందర్ రెడ్డి, తండ్రి: గడ్డం గంగారెడ్డి నుండి బ్యాంక్‌కు బకాయి అయిన నగదు లేదా నగదు బకాయి తిరిగి చెల్లింపు సెక్యూర్ చేయుటకు డాక్యుమెంట్లు ఎగ్జిక్యూట్ చేశారు మరియు దిగువ వివరించిన స్థిరాస్తి తనఖా విధానం ద్వారా సెక్యూరిటీ ఇంటరెస్ట్ కల్పించబడినది.
రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా మరియు రిజిస్ట్రేషన్ జిల్లా నిజామాబాద్, నిజామాబాద్ మున్సిపల్ పరిధిలో 56.00 చ.గజాల భూమి అవిభాజ్య వాటాతో సహా, కార్ పార్కింగ్ మరియు కామన్ ఏరియాలు కలిపి 1145.00 చ.అ. (ప్లింత్ ఏరియా) విస్తీర్ణం, నిజామాబాద్, కంఠేశ్వర్, సర్వే నెం. 302/పి1, బ్లాక్ నెం. 1, వార్డ్ నెం. 11లో గల, మున్సిపల్ నెం. 11-1-279/4/40 కలిగిన, పృథ్వి వసంత్ ప్రెస్టేజ్ పార్క్‌లో 4వ అంతస్తులో గల ఫ్లాట్ నెం. 401 కలిగిన ఆస్తి యావత్తు, **సరిహద్దులు: ఫ్లాట్ సరిహద్దులు: తూర్పు:** కారిడార్ తరువాత ఫ్లాట్ నెం. 402, **పడమర:** ఖాళీ, **ఉత్తరం:** ఖాళీ, **దక్షిణం:** ఖాళీ తరువాత ఫ్లాట్ నెం. 403. **అపార్ట్‌మెంట్ సరిహద్దులు: తూర్పు:** పొరుగువారి భూమి, **పడమర:** రోడ్, **ఉత్తరం:** పొరుగువారి భూమి, **దక్షిణం:** రోడ్.
ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా మీ పూర్తి రుణ బకాయిలను చెల్లించాల్సిందిగా మరియు మీ ద్వారా ఎగ్జిక్యూట్ చేయబడిన రుణ డాక్యుమెంట్ల నియమ నిబంధనల ప్రకారం కాంట్రాక్చువల్ రేట్ వంతున తదుపరి వడ్డీ మరియు ఛార్జీలతో పాటుగా 15-07-2024 నాటికి **రూ. 30,04,304.71/- (ముప్పై లక్షల నాలుగు వేల మూడు వందల నాలుగు రూపాయల డెబ్బై ఒక్క పైసలు మాత్రమే)**ల మొత్తాన్ని చెల్లించాల్సిందిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) నిబంధనల ప్రకారం మిమ్మల్ని కోరడం జరిగింది. విఫలమైనచో సదరు చట్టం క్రింద ఇవ్వబడిన ఏదేని లేదా అన్ని హక్కుల్ని ఉపయోగించడం ద్వారా పైన తెలిపిన సెక్యూరిటీల అమలుకు మేము కట్టుబడి ఉన్నాము.
చట్టం యొక్క సెక్షన్ 13(13) ప్రకారం ఈ నోటీసు స్వీకరణ తరువాత బ్యాంక్ యొక్క అనుమతి లేకుండా పై సెక్యూరిటీలను విక్రయించుట లేదా వాటితో లావాదేవీ నిర్వహించుట నుండి మీరు నిరోధించబడుతున్నారు.
సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునేందుకు లభించే సమయానికి సంబంధించి SARFAESIలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్(8) నిబంధనలు గమనించవల్సిందిగా మిమ్మల్ని కోరడమైనది.

ప్రచురణ తేదీ: 29-08-2024
ప్రదేశం: నిజామాబాద్
అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.